1

# అధికారము

మనం ప్రారంభించక ముందు, అధికారము అనేదానికి సంబంధించి మనం ఏకీభవింప వలసియుంటుంది. స్పెల్లింగ్ విషయంలో ప్రామాణికమైన ఆంగ్ల నిఘంటువు మనకు అధికారమైయున్నట్టు మనం ఏకీభవించకపోతే "cat" అనేదానికి "c-a-t" అని మనం అంగీకరింప వీలుండదు. అలాగే మతంలో మనం అంగీకారానికి రావాలంటే, మన అధికారమేమైయుందో ఏకీభావం మొదటిగా దానిపై కుదరవలసియుంది.

## మన అధికారము దేవుని వాక్యము

మతంలో మన అధికారం ఏమైయుండాలి? ఇస్లాము యొక్క ఖురాను మొదలుకొని దూరదర్శిని సువార్తికుల ప్రకటనవరకు, లోకము అనేక మతాధికారాలను గుర్తిస్తుంది. ఏదియెలాగున్నా, దేవుడు మాత్రం ఒకే అధికారాన్ని గుర్తిస్తాడు: అది బైబిలు అనే ఆయన వాక్యము.




అపొస్తలుడైన పౌలు యిలా అన్నాడు. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). పైగా, తాను యింకేమని వ్రాశాడంటే: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16, 17).

"లేఖనము" అనేది వ్రాయబడిన దానిని సూచిస్తుంది.[1] 2 తిమోతి 3లోని "లేఖనము" అనేది "వ్రాయబడిన దేవుని వాక్యాన్ని" సూచిస్తుంది. "లేఖనములు" అనేది అటు పాత నిబంధన రచనలను (2 తిమోతి 3:15) మరియు యిటు క్రొత్త నిబంధన రచనలను సూచిస్తుంది (2 పేతురు 3:15, 16). లేఖనాలను సూచించే మరో విధం "వాక్యము" అని (మత్తయి 13:23; అపో. 6:4), నేడు మనం ఉపయోగించే పదం "బైబిలు." బైబిలు అనేది ప్రాథమికంగా "గ్రంథము" అని అర్థమిచ్చే గ్రీకు పదం. బైబిలు వాస్తవానికి "గ్రంథ రాజమై"యుంది. అనేక బైబిళ్లమీద "పరిశుద్ధ గ్రంథము" అని ముద్రించబడి యుంటుంది. "పరిశుద్ధమైన" అంటే "పవిత్రమైన"[2] అని అర్థం. "బైబిలు పవిత్రమైన గ్రంథము" ఎందువలనంటే, అది దైవప్రేరేపిత గ్రంథమైయుంది.

"ప్రేరేపితము" అనేదానికి "breathed in"[3] అనేది అక్షరార్థము. దేవునిచేత ప్రేరేపింపబడినది అంటే, బైబిలు "దేవునిచే ఊదబడినది" అని అర్థం. "నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా" నరుడు జీవాత్మ ఎలాగయ్యాడో (ఆది. 2:7), అలాగే "దేవుడు ఊదగా" బైబిలు సజీవ గ్రంథమైనదని చెప్పవచ్చు. బైబిలు రచన దేవుని ఆధీనంలో జరిగిందని చెప్పడానికి యిది అలంకారంగా ఉపయోగింపబడింది. బైబిల్లో ఏమి ఉండాలని ఆయన కోరాడో దానినే అది కలిగియుంది – అంతకంటే ఎక్కువ లేదు, తక్కువా లేదు.

తిరిగి 2 తిమోతి 3:16, 17 చదువు. దేవుని ఆనందింపజేయడానికి కావలసిన సమస్తము బైబిల్లో ఉన్నట్టు అది తెలుపుతోంది: "ఉపదేశించడానికి అది ప్రయోజనకరమై యుంది"; మనం ఎలా జీవించాలో అది తెలియజేస్తుంది. "ఖండించుటకు" అది ప్రయోజనకరమైయుంది; మనం తప్పులో ఉన్నప్పుడు ఆ సంగతిని అది మనకు తెలుపుతుంది. అది "తప్పు దిద్దుటకు" ప్రయోజనకరమైయుంది; మన జీవితాలను మార్పు చేసికోమని అది ప్రేరేపిస్తుంది. "నీతియందు శిక్షచేయుటకు" అది ప్రయోజనకరమై యుంది; ఆత్మ సంబంధంగా ఎదగడానికి అది మనకు తోడ్పడుతుంది. ఏవో కొన్ని మంచిపనులకు అది మనలను సంసిద్ధం చేయదు, కాని "ప్రతి సత్కార్యమునకు" పూర్ణంగా సిద్ధపడియుండేలా చేస్తుంది అనే విషయాన్ని గమనించు.

అనేక సత్ గ్రంథాలు వ్రాయబడ్డాయి, అనేక గొప్ప ప్రసంగాలు చేయబడ్డాయి, సహాయపడే అనేక సలహాలు యివ్వబడ్డాయి – కాని మత సంబంధమైన మనకున్న ఒకే అధికారం బైబిలు. మన పఠనం కొనసాగించే ముందు, దీని విషయంలో మనం ఏకీభవించాలి:

- మన తల్లిదండ్రులు మన అధికారం కాదు.
- మానవ ఏ ప్రసంగియు మన అధికారం కాదు.
- మత సంబంధమైన ఏ గొప్ప నాయకుడును మన అధికారం కాదు.
- డేవిడ్ రోపర్ అధికారం కాదు.
- ____________ అధికారం కాదు. (మీ పేరు వ్రాయవలెను.)
- బైబిలు తప్ప మరే గ్రంథం అధికారం కాదు.
- మన అధికారం బైబిలు మాత్రమే.

బైబిలు మానవునికి దేవుని యొక్క ప్రత్యక్షతయై ఉన్నదని నీవు నూటికి నూరుపాళ్లు నిశ్చయం కలిగినట్టయితే, "నమ్ముటకు సవాలు" అనే సప్లిమెంటరీ వ్యాసాన్ని ఈ చివరి ప్రచురణలో చదువు. దీన్ని గూర్చి నీకు యింకా ప్రశ్న ఉన్నట్టయితే, ఈ పుస్తకాన్ని నీకిచ్చిన స్నేహితునితో మాట్లాడు. నీవు బైబిలును గూర్చి యింకా ఎక్కువగా తెలిసికోవలసి యుండవచ్చు. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" అని పౌలు అన్నాడు (రోమా 10:17). అదే నీ పరిస్థితియైతే చదువుతూ ఉండు.

## క్రొత్త నిబంధన మనకు మార్గదర్శి


"మతంలో మన అధికారమేమి?" అనే దానికి యింతవరకు మన జవాబు "బైబిలు" అని. అయినా, అంతకంటే ఎక్కువగా మన జవాబును పరిమితి చేయవలసియుంది.

బైబిల్లో రెండు ప్రధాన భాగాలున్నాయి: పాత నిబంధన, క్రొత్త నిబంధన అనేవి. బైబిలు చేత పట్టుకొని క్రొత్త నిబంధన ఆరంభాన్ని చూడు. కింగ్ జేమ్స్ ప్రతిలో "మన దేవుడు మరియు రక్షకుడైన క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన" అని పుటలో చూడవచ్చు. పాత నిబంధన క్రొత్త నిబంధన కంటె మూడు రెట్లు పెద్దదైయుంది. దీనికి పలు కారణా లున్నాయి.[4] ఒకటేమంటే, పాత నిబంధన "చేయవలెను," "చేయకూడదు" అని ప్రత్యేకింప బడిన ఆజ్ఞలతో నింపబడింది, క్రొత్త నిబంధనయైతే సూత్రాలచే నింపబడింది.[5]

లేఖనాల్లోని ఈ రెండు భాగాలను నీవు చదువుతూ ఉండగా, అవి రెండును ఒకే విధమైన ఆజ్ఞలను ఎల్లవేళలా యివ్వడంలేదని నీవు కనుగొనగలవు:

- పాత నిబంధనలో, ఆరాధకులు దేవాలయము అని పిలువబడే ఒక భౌతికమైన కట్టడానికి వెళ్లేవారు (కీర్తన. 5:7; హబక్కూకు 2:20); క్రొత్త నిబంధనలోనైతే, ఆరాధన ఆత్మతోను సత్యముతోను జరిగించేంత వరకు స్థలం అప్రధానమైనది (యోహాను 4:21, 23, 24).
- పాత నిబంధనలో, దేవునికి జంతు బలులు అర్పింపబడుతూ ఉండేవి (లేవీ. 1–5); క్రొత్త నిబంధనలో, ప్రభువైన యేసు పరిపూర్ణమైన బలియైయున్నాడు (ఎఫెసీ. 5:2; హెబ్రీ. 10:12), మనము ఆత్మసంబంధమైన బలులను అర్పింపవలసినవారమైయున్నాము (రోమా 12:1; హెబ్రీ. 13:15).
- పాత నిబంధనలో, ప్రత్యేకమైన గోత్రికులు "యాజకులుగా" నియమింపబడ్డారు (నిర్గమ. 28:41; 40:15); క్రొత్త నిబంధనలో క్రైస్తవులందరు యాజకులే (1 పేతురు 2:5, 9).
- పాత నిబంధనలో, ఏడవ దినం దేవునికి ప్రతిష్ఠింపబడాలి (నిర్గమ. 20:8–11); క్రొత్త నిబంధనలో విశేషమైన మన ఆరాధనా దినం ఆదివారం (అపొ. 20:7).[6]
- ఆహార వస్తువులలో కొన్ని, పంది మాంసము లాటివి తినడం మానవలెనని పాత నిబంధన అన్నది (లేవీ. 11:17); ఈలాటి పత్యాలు క్రొత్త నిబంధననుండి తొలిగించబడ్డాయి (అపొ. 10:9–16).

ఈ వ్యత్యాసాలను యింకా కొనసాగిస్తునే ఉండవచ్చు. రెండు నిబంధనల ఆజ్ఞలను సంపూర్ణంగా చూపించడానికి వీలుండదు. అయితే, మనం దేన్ని అనుసరించాలి? మన ప్రశ్నకు క్రింద పటం బదులిస్తుంది:




నిబంధన = ఒడంబడిక = ఒప్పందము

మొదట, పటము క్రిందనున్న మాటలను చూడు: “నిబంధన = ఒడంబడిక = ఒప్పందము.” The KJV కొన్ని సార్లు “పాత నిబంధన” (2 కొరింథీ. 3:14) మరియు “క్రొత్త నిబంధన” (మత్తయి 26:28; 1 కొరింథీ. 11:25; 2 కొరింథీ. 3:6; హెబ్రీ. 9:15) అని ఉపయోగిస్తుంది. సర్వ సాధారణంగా, ఈ లేఖనాల్లో కన్పించే గ్రీకు పదాన్ని KJV “covenant” అని తర్జుమా చేస్తుంది (హెబ్రీ. 8:6, 7, 13; 9:1; 12:24 చదువు). NASB అయితే ఈ వచనాలన్నిటిలో “covenant” నే కలిగియుంది. మనం పాత నిబంధనను గూర్చి మాట్లాడేటప్పుడు, పాత ఒడంబడికను గూర్చి మాట్లాడతాం. మనం క్రొత్త నిబంధనను గూర్చి మాట్లాడినప్పుడు, క్రొత్త ఒడంబడికను గూర్చి మాట్లాడతాం.

ఒడంబడిక అంటే ఏంటి? రెండు వర్గాల మధ్య కుదిరిన ఒప్పందమే ఒడంబడిక. యూదులకును దేవునికిని మధ్య జరిగిన ఒప్పందమే పాత నిబంధన (ద్వితీయో. 5:1–4). యూదులు[7] (యూదా మతాన్ని కౌగలించుకున్న ప్రొసలైట్స్)పై తప్ప ఎవరి మీద అది రుద్దబడలేదు. క్రొత్త నిబంధన దేవునికిని, క్రైస్తవులకును మధ్య జరిగిన ఒప్పందము (హెబ్రీ. 10:16).

ఇప్పుడు, మన ఉదాహరణలోని పై భాగాన్ని చూడు. సిలువ, క్రీస్తు సిలువను సూచిస్తుంది. సిలువకు ఎడమవైపునున్న చోటు పాత నిబంధన కాలాన్ని సూచిస్తుంది, కుడి వైపునున్న స్థలం క్రొత్త నిబంధన యుగాన్ని సూచిస్తుంది. ఎడమ వైపునున్న బాణం సిలువ దిశను సూచిస్తుంది, కుడివైపునున్న బాణం సిలువకు వెనుకతట్టునుండి చూపుతుంది.

మొదట, పాత నిబంధన క్రీస్తు అవతరించడం కొరకు ఎదురు చూచింది అని నీవు గ్రహించాలి. పాత నిబంధన శాశ్వతంగా ఉండాలని దేవుడు ఉద్దేశించలేదు సుమీ. యిర్మీయా యిలా వ్రాశాడు,

> “–ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిది కాదు” (యిర్మీయా 31:31, 32ఎ).[8]

పాత నిబంధన ఎంతకాలం కొనసాగింది? "ఎవనికి ఆ వాగ్దానం చేయబడిందో ఆ సంతానము వచ్చువరకు" అబ్రాహాముతో చేయబడిన వాగ్దానంతో పాత చట్టము "చేర్చబడినట్టు" గలతీ. 3లో పౌలు క్రైస్తవులకు తెలియజేశాడు (19 వ.). అదే అధ్యాయం 16వ వచనంలో ఆ సంతానమెవరో సూచింపబడింది: "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు – సంతానములకును అని చెప్పక ఒక్కని గూర్చి అన్నట్టే – నీ సంతానమునకును అనెను; ఆ సంతానము క్రీస్తు." 24వ వచనంలో పౌలు ఇలా అన్నాడు, "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు నడిపించాలి." మానవ సమూహమును క్రీస్తునొద్దకు నడిపించునది యేసు వచ్చునంతవరకునున్నది పాత నిబంధన. అందువలననే ఎడమవైపునున్న బాణం సిలువవైపు చూపుతుంది.

ఏదియెలాగున్నా, ఆ బాణం సిలువవైపుకు ఎందుకు చూపబడాలి? కొలస్సయలోని క్రైస్తవులకు వ్రాస్తూ, క్రీస్తు యొక్క సిలువ మరణము, "వ్రాత రూపకమైన ఆజ్ఞలవలన మనమీద రుణముగాను మనకు విరోధముగానునుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి ..." నట్లు పౌలు తెలిపాడు (కొలస్సీ. 2:13–15). జారీ చేయబడిన ఆజ్ఞలు సిలువకు కొట్టబడ్డాయని అలంకారంగా మాట్లాడినది, ఇకమీదట అది అమలులో లేదు అని ప్రకటించడమే ఔతుంది.[9] పౌలు మాట్లాడుతున్నది జారీ చేయబడిన ఏ ఆజ్ఞలను గూర్చి? అదే సందర్భంలో అతడు కొన్నింటిని ప్రస్తావించాడు: "కాబట్టి అన్నపానముల విషయములో నైనను, పండుగ అమావాస్య విశ్రాంతిదినము అనువాటి విషయములో నైనను, మీకు తీర్పు తీర్చ నెవనికిని అవకాశమియ్యకుడి" (కొలస్సీ. 2:16). ఇక్కడ ప్రత్యేకించబడిన సంగతి సబ్బాతు. అన్న పానములను గూర్చి, పండుగలను గూర్చి అనేక ఉత్తరువులు జారీ చేయబడ్డాయి కాని, సబ్బాతును గూర్చిన ఆజ్ఞలు ఒకే చట్టాల అమరికలో ఉన్నాయి: అది పది ఆజ్ఞలతో కూడిన పాత నిబంధన. నాల్గవ ఆజ్ఞ యిలా అంటుంది; "విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గమ. 20:8). ఈలాగున (పౌలు యొక్క పదజాలాన్ని ఉపయోగించితే) పాత నిబంధన సిలువకు మేకులతో కొట్టబడింది.

ఇప్పుడు మన ఉదాహరణలోని సిలువ యొక్క కుడివైపున చూద్దాం. క్రీస్తు యొక్క మరణము పాత నిబంధన యొక్క అంతాన్ని సూచించడం మాత్రమే గాక, క్రొత్త నిబంధన యొక్క ఆరంభాన్ని కూడా అది ప్రకటిస్తుంది. క్రీస్తు ప్రభువు క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నట్టు హెబ్రీ. 9:15 సూచిస్తుంది.[10] అక్కడ ఈ లేఖన భాగం యిలా వివరిస్తుంది: "మరణశాసనమెక్కడ ఉండునో అక్కడ మరణశాసనము వ్రాసినవాని మరణము అవశ్యము. ఆ శాసనమును వ్రాసినవాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా" (9:16, 17). ఇక్కడ మాట్లాడబడిన మరణ శాసనమును "కడపటి చిత్తము మరియు నిబంధన" అని మనం పిలుస్తాం. (వాక్యాలను సులభంగా అర్థం చేసుకోడానికి KJV "నిబంధన" అనే పదమునుపయోగించింది.) ఒక మనిషి యొక్క కడపటి వీలునామా ఎప్పుడు అమలులోనికి వస్తుంది?

అతడు మరణించినప్పుడే. అలాగే క్రీస్తు ప్రభువు యొక్క వీలునామా సిలువలో ఆయన మరణించినప్పుడే అమలులోనికి వస్తుంది.[11]

క్రీస్తు యొక్క జన్మ క్రొత్త నిబంధనకు ఆరంభమనే అపార్థం సత్యం కాదు. ప్రభువు తానే పాత నిబంధన క్రింద జీవించాడు. ఆయన మంచి యూదుడుగా జీవించి, పాత నిబంధన చట్టాలను ఆయన అనుసరించాడు. (వాస్తవానికి, వాటిని సంపూర్ణంగా అనుసరించినవాడు ఆయన ఒక్కడు మాత్రమే సుమీ.) ఇది కొందరిని తబ్బిబ్బు చేస్తుంది. ఉదాహరణకు, ప్రభువైన యేసు సబ్బాతు (శనివారం) (మార్కు 1:21; లూకా 4:16) ఆచరించినవారు గనుక మనం కూడ (వారంలోని ఏడవ దినాన) సబ్బాతు దినాన ఆరాధన చేయాలని కొందరంటారు. ఏదియెలాగున్నా, ఆయన భూ నివాస కాలంలో, పాత నిబంధన సమస్త చట్టాలను అనుసరించాలని ఆయన జనులను ప్రోత్సహించాడు (మత్తయి 19:17), అందులో జంతు బలులు అర్పించడం కూడా చేర్చబడింది (మత్తయి 5:23; 8:4). క్రొత్త నిబంధన క్రీస్తు యొక్క జననంతో గాక, ఆయన మరణంతోనే ఆరంభమౌతుంది.

బొమ్మను పఠించుము. యేసు మరణమునకు ముందు జీవించిన యూదులు పాత నిబంధన క్రింద ఉన్నారు. సిలువకు ఇటు ప్రక్క ఎవరైతే ఉన్నారో వారు క్రొత్త నిబంధన క్రింద ఉన్నారు. యేసు మరణమే విభాగింపబడిన గుర్తు. ప్రభువు మరణానికి ముందు జీవించిన యూదులు పాత నిబంధన చట్టాల క్రింద వారికను ఏ మాత్రమును లేరు అనే భావనతో తంటాలుపడ్డారు. యూదుల్లోనుండి క్రైస్తవులైన కొందరు, అన్యజనులలోనుండి[12] క్రైస్తవులైనవారిని ధర్మశాస్త్రాన్ని అనుసరించేలా ప్రేరేపించారు లేదా సున్నతిలాటి[13] కొంత భాగాన్నైనా వెంటాడాలని బోధించారు. ఈ సమస్యను క్రొత్త నిబంధన రచనలలో కొన్ని, గలతీ, హెబ్రీ పత్రికలతో – చేర్చి చర్చిస్తాయి. గలతీ పుస్తకంనుండి నేను కొన్ని లేఖన భాగాలను ప్రస్తావించాను, యింకా కొన్నింటిని చూద్దాం.

గలతీ. 3ను మరోసారి చూడు: "… మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" అని పౌలు తెలిపాడు (24, 25 వచనాలు). ముందుగా గమనించినట్టే, పాత నిబంధన యొక్క ముఖ్యమైన ఉద్దేశము మానవాళిని క్రీస్తునొద్దకు నడిపించడమే. ఆ పని లేక ఉద్దేశము నెరవేర్చబడిన తరువాత, జనులు యికను ఏ మాత్రమును ధర్మశాస్త్రము "క్రింద జీవించరు."

గలతీ. 5వ అధ్యాయంలో పౌలు దీన్ని యింకా బలీయంగా నొక్కి చెప్పాడు. 3వ వచనంలో అతడు యిలా అన్నాడు, "ధర్మశాస్త్రము యావత్తు ఆచరింప బద్ధుడైయున్నాడని సున్నతిపొందిన ప్రతి మనుష్యునికి నేను మరల దృఢముగా చెప్పుచున్నాను," "సున్నతి" అనేది యిక్కడ మత సంబంధమైన కార్యముగా జరిగించేదే గాని వైద్య సంబంధంగా జరిగించేది కాదు. పాత నిబంధనలో బోధించిన విధంగా అన్యజనుల్లోనుండి క్రైస్తవులైనవారు (గలతీయలోని వారిలా) సున్నతి పొందాలని యూదుల్లోనుండి క్రైస్తవులైన కొందరు బోధించారు, ధర్మశాస్త్రంలో ఒక భాగాన్ని అనుసరించేవాడవైనట్టయితే, ధర్మశాస్త్రమంతయు

పాటించ బద్ధుడవైయున్నావని పౌలు గలతీ. 5:3లో అంటున్నాడు.


(సంవత్సరానికి ముమ్మారు యెరూషలేమునకు వెళ్లడం, జంతు బలులు చేయడం, భోజన సంబంధమైన విధులకు లోబడడం, మొదలైనవాటితో కూడిన) పాత నిబంధన ఆజ్ఞలను ఆచరించడానికి కోరుకునే వారెవరూ ఉన్నట్టు నాకు తెలియదు. ఏదియెలాగున్నా, అనేకులు, సబ్బాతు దినాచారము, వేరైన యాజకత్వము, లేక ఆరాధనలో వాయిద్యాలు వాయించడంలాటి కొన్ని ఆజ్ఞలను అనుకూలమైనట్టు పాత నిబంధన ఆజ్ఞలలో అనేకులు "ఏరుకొని కోరుకుంటారు" అలాటిది చేయ వీలుపడదని పౌలు మనలను హెచ్చరించాడు. పాత నిబంధనలోని కొంత భాగాన్ని చట్టముగా భావించినచో, చట్టమంతయు అనుసరించాలి. పాత నిబంధన చట్టంలో ఒక భాగాన్ని మనం బంధించినట్లయితే, అంతటిని బంధింపవలసినవారమైయున్నాము.

పాత నిబంధనను బంధించడంవలన కలిగే ఫలితమే చాలినంత చెడ్డది, అయితే గలతీ. 5లో ప్రస్తావించబడిన ఫలితం అంతకంటే చెడ్డది. 4వ వచనంలో పౌలు యిలా అన్నాడు, "మీలో ధర్మశాస్త్రమువలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరుచేయబడియున్నారు, కృపలోనుండి తొలిగిపోయియున్నారు" పాత నిబంధన ప్రాథమికంగా "చట్టము మరియు క్రియలు" అయ్యుండగా, క్రొత్త నిబంధన "కృప–మరియు–విశ్వాస" నియమమైయుంది. పాత నిబంధన కర్మయై ఉన్న సున్నతికి గలతీయలోని క్రైస్తవులు తమ్మును తాము లోబరచుకొన్నట్టయితే, అది వారిని క్రీస్తు నుండి బొత్తిగా వేరు చేస్తుందని పౌలు చెప్పాడు – ఎందుకంటే ఒకే సమయంలో ఒకడు వేరైయున్న రెండు మత విధానాలలో మసలుకోలేడు. వారు అటు ధర్మశాస్త్రపు ఏర్పాటు క్రిందైనా ఉండాలి లేదా యిటు కృపా ఏర్పాటు క్రిందైనా ఉండాలి, కాని వారు ఆ రెండింటి క్రింద ఉండ నేరరు.

దీనిని నేను మరో విధానంలో చెప్పుతాను: (పాత నిబంధన కర్మయైన సున్నతిని వారు అంగీకరించినవారై) వారు ధర్మశాస్త్రపు ఏర్పాటును కోరుకున్న వారైయున్నట్టయితే, వారు రక్షింపబడనేరరు. ధర్మశాస్త్రపు నియమం క్రింద ఎవడును రక్షింపబడనేరడు ఎందుకంటే, ధర్మశాస్త్రాన్ని పరిపూర్ణంగా ఎవడును అనుసరించలేడు (రోమా 3:23; 7:15, 18, 19). ఒకవేళ మనం రక్షింపబడాలంటే మాత్రం అది దేవుని కృప కనికరముల ద్వారానే (ఎఫెసీ. 2:8, 9; 1 పేతురు 2:10). దీనికి బదులు గలతీయులు పాత చట్టానికి పాత చట్టం క్రింద వెళ్లదలచుకుంటే మాత్రం వారు "క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడతారు" "కృపలోనుండి తొలిగిపోతారు." అది ఎంతటి విపత్కరమైన స్థితి!


నేడు మనం క్రొత్త నిబంధన క్రింద ఉన్నాం, పాత నిబంధన క్రింద కాదని గ్రహించడం ప్రాముఖ్యం. అపార్థం ఏమీ లేకుండడానికి గాను, దీని భావం మనం యికమీదట పది ఆజ్ఞల[14] క్రిందలేము అని నేను నొక్కి చెప్పాలి. పది ఆజ్ఞలు (నిర్గమ. 20; ద్వితీయో. 5) సిలువలో మేకులతో కొట్టబడిన నిబంధన యొక్క హృదయమును కేంద్ర స్థానమునై ఉంది.

"మనము పది ఆజ్ఞల క్రిందలేనట్టయితే, దాని భావం మనం హత్య చేయవచ్చు, దొంగిలవచ్చు మరియు ఆ ఆజ్ఞలచేత అధికార పూర్వకంగా నిషేధింపబడిన యితర




కార్యములను చేయవచ్చు"నని ఎవరైనా ఆక్షేపించవచ్చు. లేదు, నేడు జనులు హత్య చేయకూడదు దొంగిలకూడదు ఎందుకంటే అట్టి కార్యాలు క్రొత్త నిబంధనచేత అధికార పూర్వకముగా నిషేధింపబడ్డాయి సుమీ (రోమా 13:9; ఎఫెసీ. 4:28). వాస్తవంగా, పది ఆజ్ఞలలో తొమ్మిది ఏదో ఒక రూపంగా క్రొత్త నిబంధనలో[15] తిరిగి చెప్పబడ్డాయి. పది ఆజ్ఞలలో క్రొత్త నిబంధనయందు తిరిగి చెప్పబడనిది ఒకే ఒక్కటి, అది నాల్గవ ఆజ్ఞ: "విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకము చేసికొనుము" అనేది (నిర్గమ. 20:8). నేడు, మన ఆరాధనకు "ప్రత్యేకమైన" దినము (ఆదివారము) వారంలో మొదటి దినము, ఏడవ దినం కాదు.[16]

పాత నిబంధనలో కాదు, నేడు మనం క్రొత్త నిబంధనలో – ఉన్నామన్న సూత్రము ఎదురయ్యే అనేక మత సంబంధమైన ప్రశ్నలకు జవాబిస్తుంది. "దేవాలయమనే ఒక పవిత్ర ఆరాధనా స్థలాన్ని గూర్చి బైబిలు తెలుపుతుంది. ఆరాధించడానికి పవిత్రమైన దేవాలయము మనం ఎందుకు కలిగియుండకూడదు?" అని ఒకరు అనవచ్చు. దానికి జవాబు ఏమంటే, "అట్టిది పాత నిబంధనలో ఉందిగాని క్రొత్త నిబంధనలో లేదు." ప్రత్యేకమైన యాజక వస్త్రాలతో వేరైన యాజకత్వాన్ని గురించి బైబిలు మాట్లాడింది. "అట్టివి మనకెందుకు లేదు" అని మరియొకరు అడుగవచ్చు. దానికి జవాబు "అట్టి ఏర్పాటు పాత నిబంధనలో ఉంది, క్రొత్త నిబంధనలో లేదు." "ధూపం వేయడాన్ని గూర్చియు, సంగీత వాయిద్యాలు ఉపయోగించడాన్ని గూర్చియు నేను బైబిల్లో చదువు



తున్నాను. మనం అలాటి కార్యాలను ఎందుకు అనుసరించకూడదు?" అని యింకొకరు అడుగవచ్చు. దానికి జవాబు, "అది పాత నిబంధనలో ఉంది గాని క్రొత్త నిబంధనలో లేదు."

మన పఠనాన్ని మనం కొనసాగిస్తుండగా, దేవుని ఎలా ఆనందింపజేయాలి, మనం చనిపోయిన తరువాత ఎలా పరలోకానికి వెళ్లాలి అనే విషయాలకొరకు మనం క్రొత్త నిబంధనకు వెళ్లదాం.

## పాత నిబంధనలోని మదింపు (విలువ)

ఇంతగా చెప్పిన తరువాత, పాత నిబంధన, క్రైస్తవులకు ఏ విలువలేనిదని దీని అర్థం కాదు అన్న విషయాన్ని నొక్కి చెప్పనిమ్ము. 1 కొరింథీ. 10లో పాత నిబంధన సంభవాలను పౌలు తన పాఠకులకు జ్ఞాపకం చేసిన మీదట పౌలు యిలా అన్నాడు, "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను'' (11వ.). మనం నేర్చుకొనడానికి అనువైన ఉదాహరణలతో పాత నిబంధన నిండియుంది. ఉదాహరణకు, క్రొత్త నిబంధనలో మనం "విశ్వాసంవలన జీవించాలని" చెప్పబడ్డాం (రోమా 1:17; గలతీ. 2:20), అయితే దాని అర్థమేమి? దీన్ని కనుగొనే ఒక మార్గం పాత నిబంధనలో అబ్రాహామువంటి విశ్వాసం యొక్క ఉదాహరణలే (హెబ్రీ. 11:9, 17లను చూడు).

రోమాలోని క్రైస్తవులకు పౌలు యిలా తెలియజేశాడు, "ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి" (రోమా 15:4). క్రొత్త నిబంధన వందకంటె తక్కువ సంవత్సరాల చరిత్రను మరియు దాదాపు అరవై సంవత్సరాల క్రైస్తవ్యాన్ని అది తెలియ చేస్తుంది. దానికి కొన్ని సత్వర బహుమానాలున్నాయి (వ్యతిరేక ఉదాహరణకు, అపొ. 5:1-11ను చూడు), అయితే ఎలా జీవించాలి, మరియు మనం దేవునికి లోబడినట్లయితే ఆశీర్వాదాలను వాగ్దానం చేస్తుంది. దేవుడు నిజంగా తన వాగ్దానాలను నెరవేర్చుతాడా అని మనం ఆశ్చర్యపోవచ్చు. ఆయన అలా చేస్తాడని పాత నిబంధన మనకు అభయమిస్తుంది. పాత నిబంధన కొన్నివేల సంవత్సరాల చరిత్రను తెలియ చేస్తున్నందున, విధేయతకు అవిధేయతకు కలిగే దీర్ఘకాల ప్రతిఫలాలను మనం స్పష్టంగా చూడవచ్చు: జనులు దేవునికి లోబడినప్పుడు, వారు నిజంగా దీవించబడ్డారు; వారు దేవునికి అవిధేయులైనప్పుడు, దాని ఫలితాలను వారు అనుభవించారు. ఈ విధంగా, పాత నిబంధన లేఖనములద్వారా, "దేవుడు నమ్మదగినవాడని" మనకు అభయం యివ్వబడింది (1 కొరింథీ. 1:9).

పాత నిబంధనను పఠించడంద్వారా యింకను అనేక విధములైన ప్రయోజనాలు కలుగుతాయి: నీవు లోకం యొక్క ఆరంభాన్ని గూర్చియు మానవ ఆరంభాన్ని గూర్చియు తెలిసికొనగోరినట్లయితే, నీ ప్రాథమిక మూలం పాత నిబంధనయే (ఆది. 1; 2). క్రొత్త నిబంధనలో ఎక్కువ భాగం (ఉదాహరణకు హెబ్రీ పత్రిక) కొంత పాత నిబంధన జ్ఞానమును

ముందుగా తలంచుతోంది. పాత నిబంధన యొక్క పఠనము క్రొత్త నిబంధనను గ్రహించేదిగా చేస్తుంది. అందును బట్టి నీవు చదివే క్రమంలో పాత నిబంధనను చేర్చుకొనేలా నేను నిన్ను ప్రోత్సహించుతున్నాను. ఏదియేలాగున్నా, ఒకటి మాత్రం ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకో, ఏమంటే–నేడు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క క్రొత్త నిబంధన క్రింద ఉన్నాం. నిత్య జీవమనే మన గమ్యాన్ని చేరడానికి గాను ప్రత్యేకమైన లేక విశేషమైన ఉపదేశాన్ని క్రొత్త నిబంధనయందు మనము కనుగొనగలం.

## ముగింపు

మత సంబంధమైన మన అధికారం బైబిలే. ప్రత్యేకించి, క్రొత్త నిబంధనయే నేడు మనమీద బంధింపబడింది. ఈ కారణాన్ని బట్టి, క్రొత్త నిబంధన ప్రముఖమైన సమాచారమునకు మరియు ఉపదేశానికి మూలమైయుంది. నీవు అంగీకరిస్తావా లేక ఏకీభవిస్తావా? అలాగైనట్టయితే, తరువాత పాఠానికి నీవు సిద్ధంగా ఉన్నావు.

---

సూచనలు

[1]"లిఖించుట" అనే దానినుండి "లేఖనము" అనేది వచ్చినట్టు నీవు ఎరిగియుండవచ్చు. [2]పరిశుద్ధమైన లేక పవిత్రమైన అని తర్జుమా చేయబడిన గ్రీకు పదమంటే – "ప్రత్యేకమైన పని లేక ఉద్దేశం కొరకు కడగా ఉంచబడిన" అని భావం. "పరిశుద్ధమైన" అంటే "ప్రత్యేకమైన" అని నేను పిల్లలకు ఉపదేశిస్తాను. [3]ఎవరైనా చనిపోతే, అతడు "తన చివరి ఊపిరిని పీల్చాడు" అని అంటాం. "ఊపిరి బయటికి వదిలాడు" అంటే "చనిపోయాడని" అర్థం. [4]కారణాల్లో యిది ఒకటి: పాత నిబంధన కొన్నివేల సంవత్సరాల చరిత్రను తెలియజేస్తుండగా, క్రొత్త నిబంధనయైతే వందకంటె తక్కువ సంవత్సరాలను తెలియజేస్తుంది. [5]క్రొత్త నిబంధనలో ప్రత్యేకమైన శాసనాలు లేవని దాని భావం కాదు. ప్రత్యేకమైన శాసనాలు అనుకూలమైనవి ప్రతికూలమైనవి క్రొత్త నిబంధనలో ఉన్నాయి, అయితే మన జీవితాలకు వర్తింపజేసే సూత్రాలమీద నొక్కి పలకడం జరిగింది. నేనిచ్చే ఉదాహరణ ఏమిటంటే పిల్లలతో మనమెలా ఉంటాము అనేది. వారి బాల్య దశలో నడవడిక ఎలా ఉండాలో తెలియజేస్తాము. వారు పెరిగి పెద్దవారయ్యాక "మంచిగా నడుచుకోమని" చెబుతాము, వారు చేసే ప్రతి పనిలో ఈ భావనను చేర్చుకొంటారని భావిస్తాము. [6]ఈ విషయాన్ని 9వ పాఠంలో మనం చర్చిస్తాం. [7]అబ్రాహాము శారాలకు మనుమడైయున్న యాకోబు యొక్క సంతతివారే ఈ యూదులు. యాకోబు పేరు ఇశ్రాయేలుగా మార్చబడినందున, ఈ ప్రజలను ఇశ్రాయేలీయులని బైబిలు పిలిచింది. మరియు వారు హెబ్రీ భాష మాట్లాడేవారు గనుక హెబ్రీయులని కూడా వారు పిలువబడ్డారు. [8]యిర్మీయా 31:33, 34ను మరియు హెబ్రీ. 8:6–13లను కూడా చూడు. [9]చట్టపరమైన ఒడంబడికలను ప్రచురించడంలో రకరకాలైన విధానాలను ఆయా సమాజాలు అనుసరిస్తాయి. కొన్నింటిలో నిబంధనలు చదువబడతాయి, మరికొన్ని వార్తా పత్రికల్లో ప్రచురించబడతాయి. ఒక ఒప్పందం నెరవేర్చబడినట్టు బహిరంగంగా అందరికి ఎరుకగునట్లు ప్రకటించ బడినందున అది యికనెన్నడు అమలులోలేదని తెలియబడుతుంది. బైబిలు కాలంలో అలా జరుగుతున్నట్టు కన్పిస్తుంది. "సిలువలో మేకులతో కొట్టి" అని పౌలు ఉపయోగించింది ఈలాటి అలంకారమై యుండవచ్చు. [10]పాత నిబంధనలోను క్రొత్త నిబంధనలోను ఉన్న వారిని రక్షించడానికి క్రీస్తు ప్రభువు రక్తం ఒలికించబడినట్టు హెబ్రీ. 9:15లోని మిగిలిన భాగము వర్ణిస్తుంది.

[11]ఈ ఉదాహరణను పెంచవచ్చు. ఉదాహరణకు, మనిషి మరణించిన పిమ్మట, సాధారణంగా "period of probation" వీలునామా యొక్క షరత్తులు చదవక ముందు ఉండవచ్చు. ప్రభువైన యేసు మరణానికి క్రొత్త నిబంధన ప్రకటింపబడడానికి మధ్య రమారమి 50 దినాలు ఉన్నాయి. యూదుల పస్కా పండుగ సమయంలో

యేసు మృతినొందాడు (యోహాను 13:1). యాభై దినాలకు యూదుల పెంతెకొస్తను పండుగ దినాన మొదటి సువార్త ప్రకటన చేయబడింది (అపొ. 2:1, 14–40). [12]యూదేతరులను అన్యజనులంటారు. ఈ నిర్వచనాన్నిబట్టి నేను అన్యజనుడనే, నీవు కూడా అయ్యుండవచ్చు. [13]యూదుల పసికందులు ఎనిమిదియవ దినాన మత సంబంధమైన కర్మగా సున్నతి చేయబడేవారు (లేవీయ. 12:3). [14]2 కొరింథీ. 3:3, 7, 8; రోమా 7:4, 7లను చూడు. [15]పాత నిబంధనలో ఉన్నట్టే కొన్ని క్రొత్త నిబంధనలో మక్కీకి మక్కీ దించబడింది. తక్కినవి సూత్రాల్లో కన్పిస్తాయి. పది ఆజ్ఞల్లో ఎక్కువ భాగము ప్రతి తరములోను అవసరమైన ప్రాథమిక విలువలు కన్పిస్తాయి. దేవుడు తన ప్రజలతో చేసిన క్రొత్త నిబంధనలో వాటిలో తొమ్మిది చేర్చబడ్డాయి. [16]9వ పాఠంలో దీన్ని మనం చర్చిస్తాం.